


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 162, పేజీలు - 08
సోమవారం, అక్టోబర్ 21, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## త్వరలో అన్ని రంగాల్లో
# తెలంగాణ నెంబర్ 1

**- ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్**

- నాయకుడిగా ఎదగాలంటే అదృష్టం కూడా అవసరం
- లీడర్లకు 2 లక్షణాలు తప్పక ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- గొప్ప పనులు చేయడానికి రిస్క్ తీసుకోవాలి
- ధైర్యం, త్యాగం అనే రెండు విలువల గురించి తెలుసుకోవాలి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నాయకుడిగా ఎదగాలంటే తెలివితేటలు, నైపుణ్యం, కష్టపడి పనిచేయడంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా అవసరమని అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్ ప్రారంభం కాగా ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. అనంతరం మాట్లాడిన ఆయన రాజకీయాల నుంచి తాను నాయకత్వం అంటే ఏంటో తెలుసుకున్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన వారసత్వం ఉందని చెప్పారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి నాయకులే అందుకు ఉదాహరణ అని అని అన్నారు. ఎవరైనా సరే గొప్ప పనులు చేయడానికి రిస్క్ తీసుకోవాలని రిస్క్

2లో..




## హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు
# ఎంఎంటీఎస్

**- త్వరలోనే పనులు ప్రారంభం**
**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రూ. 430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ. 430 కోట్లతో చర్లపల్లి, రూ. 715 కోట్లతో సికింద్రాబాద్, రూ. 429 కోట్లతో నాంపల్లి రైల్వే స్టేషన్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడతోపాటు అదనంగా చర్లపల్లిని నాలుగో నూతన రైల్వే స్టేషన్‌గా రాబోతోందన్నారు. దీని కారణంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. రూ. 521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్

2లో..

# ఉలిక్కిపడ్డ దేశ రాజధాని

- దేశ రాజధాని ఢిల్లీ నగరంలో భారీ పేలుడు
- రోహిణి సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద ఘటన
- ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన భద్రతా బలగాలు

2లో..



## జీవో నంబర్ 317పై తుది నివేదిక

**- సీఎం రేవంత్ రెడ్డికి అందజేసిన కేబినెట్ సబ్ కమిటీ**

2లో..



# పబ్బుల్లో గబ్బు పనులు

**- టాస్ పబ్ కేసులో నోరెళ్లబెట్టే నిజాలు**

- చెయ్యేస్తే వెయ్యి, సరసాలాడితే 1500
- టాస్ పబ్ యవ్వారం మామూలుగా లేదు
- ఆ పనులకు ఓపెన్ ఆఫర్లు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో పబ్ కల్చర్ రోజు రోజుకు పెరిగిపోతోంది. బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ లాంటి ఖరీదైన ప్రాంతాల్లో విచ్చలవిడిగా పబ్‌లు ఏర్పాటు చేసి యువతను ఆకర్షిస్తున్నాయి.




2లో..

## ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి
## వదిలావ్ నువ్వా మాట్లాడేది..?

**- జగన్‌కు నారా లోకేశ్ ప్రశ్నల వర్షం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** గత ఐదేళ్ల పాలనలో వేల మంది చనిపోయినా ఒక్క సమీక్ష నిర్వహించని జగన్ ఇప్పుడు శాంతి భద్రతలు, లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారన్న జగన్ విమర్శలకు ఆయన ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. 'రాష్ట్రంలో ఐదేళ్ల పాటు గంజాయి, డ్రగ్స్ వ్యాప్తి చేసి సొమ్ము చేసుకున్నావ్. ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి ప్రజల మీదకు వదిలావ్. ఎర్రచందనం స్మగ్లర్లకు టికెట్లు ఇచ్చావ్. అలాంటి నువ్వు లా అండ్ ఆర్డర్, శాంతి భద్రతల గురించి మాట్లాడుతున్నావా.?.' అంటూ ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

### లోకేశ్ ప్రశ్నల వర్షం

ఈ సందర్భంగా జగన్‌కు మంత్రి లోకేశ్ ప్రశ్నల

2లో..



## సీఎం ఆదేశాలకు
# కట్టుబడి ఉన్నాం

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై సీఎం కామెంట్స్
- కూల్చివేతలపై 'హైడ్రా' కీలక ప్రకటన
- ఆ నిర్మాణాల జోలికెళ్లమన్న రంగనాథ్

2లో..



## చికెన్ బిర్యానీలో
# కప్ప కళేబరం

- గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో కలకలం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలోని మెస్‌లో వడ్డించిన చికెన్ బిర్యానీలో కప్ప కనిపించడం కలకలం రేపింది. బిర్యానీలో కప్పను చూసిన విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మెస్ ఇంఛార్జీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిర్యానీలో కప్ప ప్రత్యక్షం అంటూ సోషల్ మీడియాలో ఫొటోను సోషల్ మీడియాలో పంచుకోవడంతో వైరల్ అయ్యింది. అక్టోబర్ 16న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కదాంబ మెస్‌లో చికెన్ బిర్యానీ తీసుకోగా.. అందులో కప్ప వచ్చింది. బిర్యానీలో వచ్చిన కప్ప

2లో..

## పవన్ నిర్ణయంతో
# డబుల్ ధమాకా



- అంకుడు, తెల్ల పొనికి చెట్లను పెంచాలన్న పవన్ కళ్యాణ్
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు ఆదేశం
- కొండపల్లి, ఏటికొప్పాక కళాకారుల కోసం నిర్ణయం

2లో..

## గవర్నర్ దత్తాత్రేయ
# కాన్వాయ్‌కి ప్రమాదం

- శంషాబాద్ వెళ్తుండగా ఘటన

2లో..




# ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్

**- రేవంత్‌పై కేటీఆర్ సెటైర్లు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు జాతీయ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై మండిపడ్డారు. రుణమాఫీ చేసినట్లు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారని, రైతుల లెక్కల విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి అదే టెక్నిక్ వాడారంటూ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షలు అనే సంఖ్యను సీఎం రేవంత్ రెడ్డి (ఏఐ) అంటే ఎనుముల ఇంటెలిజెన్స్ తో రూపొందిందేనని కేటీఆర్ సెటైర్లు వేశారు. నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు

2లో..



# త్వరలో అన్ని రంగాల్లో తెలంగాణ నెంబర్ 1

తీసుకోకుండా కొన్ని సాధించలేమని వ్యాఖ్యనించారు. గొప్ప నాయకులుగా ఎదగాలంటే కొన్నిసార్లు త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. అలాంటి వారే గొప్పగా ఎదగగలరని అన్నారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే ముందుగా ధైర్యం, త్యాగం అనే రెండు విలువల గురించి తెలుసుకోవాలని సూచించారు. ధైర్యంతో పాటు త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉంటే జీవితంలో ఓటమి తెలియకుండా విజయం సాధిస్తారని ఐఎస్‌బీ స్టూడెంట్స్‌కు సూచించారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే తన నెక్ట్స్ టార్గెట్ అని అన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోని ప్రతి భాగానికి తీసుకెళ్లడానికి నాకు మీ సాయం కావాలని విద్యార్థులను కోరారు. మీరు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఇన్వెస్టర్లు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం గురించి గొప్పగా మాట్లాడాలన్నారు. భారత్‌లోని ఇతర నగరాలతో హైదరాబాద్ పోటీపడాలని తాను ఏనాడు కోరుకోవటం లేదని చెప్పారు. లండన్, పారిస్, న్యూయార్క్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ నగరం పోటీపడాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రపంచపటంలో భారతదేశం, హైదరాబాద్ నగరాన్ని అత్యుత్తమంగా మారాలన్నది చాలా పెద్ద లక్ష్యమన్నారు. అయినా అది అసాధ్యం కాదన్నారు. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే మంచి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు వెల్లడించారు. తాను సౌత్ కొరియాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించినట్లు చెప్పిన రేవంత్ అటువంటి సౌకర్యాలు మన స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఉంటాయని అన్నారు. ఐఎస్‌బీ విద్యార్థులుగా మీరు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌లు అని చెప్పుకొచ్చారు.

## హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు

# ఎంఎంటీఎస్

యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి(యాదగిరిగుట్ట) వరకు ఎంఎంటీఎస్ పొడిగించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని కిషన్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చి దిద్దుతున్నామన్నారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రైల్వే ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రధాని నరేంద్ర మోడీ రైల్వే కవచ్ వ్యవస్థను తెలంగాణలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టామని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వందేభారత్ రైళ్లు ఢిల్లీ తర్వాత తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. త్వరలో వందేభారత్ ట్రైన్ లలో స్లీపర్ కోచ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. 346 కిలోమీటర్ల మేర తెలంగాణలో రైల్వే లైన్లు నిర్మించామన్నారు. 369 కిలోమీటర్ల మీర సింగిల్, డబుల్ లైన్లు నిర్మించామని వెల్లడించారు.

## ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి

# వదిలావ్ నువ్వా మాట్లాడేది.?

వర్షం కురిపించారు.

'1. నీ 5 ఏళ్ల పాలనలో 2,027 మంది మహిళలు దారుణ హత్యకు గురి కాగా.. 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారు. ఏనాడైనా, ఒక్క మహిళ దగ్గరకు వెళ్లి పరామర్శించావా ? కనీసం ఒక్కసారైనా ఖండించావా ? ఒక్కసారైనా సమీక్ష చేశావా?.

2. నీ పాలనలో కోనసీమ జిల్లాలో 12 ఏళ్ల బాలికపైన ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారు. విజయవాడలో యువతిని 11 కత్తిపోట్లు పొడిచి చంపారు. నీ ఇంటి సమీపంలోని సీతానగరంలో యువతిపై అత్యాచారం జరిగితే కనీసం స్పందించలేదు. నీకు అసలు మాట్లాడే అర్హత ఉందా జగన్ ?.

3. వైసీపీ 5 ఏళ్ల పాలనలో, నీ ముఠా మొత్తం ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడ్డారు. ఎస్సీలు 192 మంది, ఎస్టీలు 58 మంది హత్యకు గురయ్యారు. మైనార్టీలపైనా దాడులకు పాల్పడ్డారు. అబ్దుల్ సలాం కుటుంబ ఘటన కంటే ఘోరమైన సంఘటన రాష్ట్రంలో మరొకటి ఉంటుందా. నరసరావుపేటలో వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరిన ఇబ్రహీంను నడిరోడ్డుపై చంపారు. పలమనేరులో మిస్బా అనే 10వ తరగతి విద్యార్థిని బాగా చదువుతుంది. వైసీపీ నేత కూతురు కంటే చదువులో ముందంజలో ఉందని వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడింది. మైనారిటీ ఆడబిడ్డ కష్టపడి చదువుకోవడానికి కూడా స్వేచ్ఛ లేకుండా చేశారు. నువ్వు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నావా.?

4. దిశ చట్టం అంటూ లేని చట్టాన్ని ఉన్నట్లు ప్రచారం చేస్తున్నావ్. అందులో లోపాలున్నాయని కేంద్రం తిప్పి పంపితే, ఇక ఆ తర్వాత మళ్లీ దాని గురించి పట్టించుకోలేదు. లేని చట్టం పేరుతో పోలీస్ స్టేషన్లు పెట్టి యాప్ డౌన్లోడ్ చేయించారు. ఆడబిడ్డలపై అత్యాచారం చేస్తే దిశ చట్ట ప్రకారం ఉరిశిక్ష వేస్తామని చెప్పిన వ్యక్తి ఒక్కరికైనా వేశారా? ఎందుకీ అబద్ధపు బ్రతుకు జగన్ ?

5. రాష్ట్రంలో జరికే ప్రతి నేరానికి, నువ్వు పెంచి పోషించిన గంజాయి మాఫియానే కారణం. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఏపీలోనే ఉండేలా నీ పాలన సాగింది. ఒక్కసారైనా గంజాయిపై సమీక్ష చేశావా ? మేము రాగానే, గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేయటానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం.

6. 2014-19 మధ్య రాష్ట్రంలో 14,770 ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలు పెడితే, నువ్వు రాగానే వాటిని మూల పడేసింది నిజం కాదా ? ఆటోమేటిక్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ విధానాన్ని నాశనం చేసింది నువ్వు కాదా? ఇవన్నీ నువ్వు , నీ పార్టీలో ఉండే క్రిమినల్స్ దొరక్కుండా ఉండటానికి, నువ్వు వేసిన ప్లాన్ కాదా.?

7. కూటమి ప్రభుత్వం రాగానే, 5 ఏళ్ల పాటు నువ్వు సమాజంలో నాటిన విష భీజాలు పీకి పడేసే పనిలో ఉంది. 120 రోజుల్లోనే అనేక కార్యక్రమాలు తీసుకుని వచ్చాం. గంజాయిపై ముందుగా దృష్టి పెట్టాం. గంజాయి మత్తులో జరుగుతున్న క్రైమ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం. ఏ ఘటన జరిగినా వెంటనే చర్యలు తీసుకుని, నేరం చేసిన వాడిని అరెస్ట్ చేస్తున్నాం. కేసు తీవ్రతని బట్టి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నాం. సమాజంలో సైకోలని కంట్రోల్‌లో పెట్టటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అయినా కొన్ని దురదృష్టకర ఘటనలు జరుగుతున్నాయి. జరిగిన వెంటనే చర్యలు ఉంటున్నాయి. నీలాగా నిద్ర పోవటం లేదు.

8. సీమలో నువ్వు, నీ కుటుంబం పెంచి పోషించిన ఫ్యాక్షనిజం అణిచివేసిన చరిత్ర చంద్రబాబు గారిది. సొంత పార్టీ నేతలను కూడా ఉపేక్షించకుండా అరెస్ట్ చేసిన చరిత్ర ఆయనది. నువ్వు, నీ కుటుంబం రౌడీలని పెంచి పోషిస్తే, రౌడీ అనే పేరు వినబడటానికే భయపడేలా పీడీ యాక్ట్ పెట్టి శిక్షించింది చంద్రబాబు గారు. తీవ్రవాదంపై పోరాడింది చంద్రబాబు గారు. ఇప్పుడు కూడా గత 5 ఏళ్లు నువ్వు పెంచి పోషించిన సైకోలని, రాష్ట్రం నుంచి తరిమి కొట్టి, సైకోల ఫ్రీ రాష్ట్రంగా చేసేది కూడా చంద్రబాబు గారే.' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# సీఎం ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీయడానికి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక మూలాలను అస్థిరం చేయడానికి బీఆర్ఎస్, బీజేపీలు కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యనించిన సంగతి తెలిసిందే. శనివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ స్థలాలను, చెరువులను, కుంటలు, నాలాలను కబ్జా చేసినవారికి 'హైడ్రా' ఒక భూతం లాంటిదన్నారు. వారి పట్ల ఒక హైడ్రా అంకుశంలాగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. హైడ్రాపై కొందరు పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. హైడ్రా, మూసీ పునరుజ్జీవనం వేర్వేరు అంశాలని అన్నారు. ఇప్పటివరకు మూసీ పరిసరాల్లో కూల్చివేతలే జరగలేదని, హైడ్రా అటువైపు వెళ్ళనే లేదని అన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు తమ ఫామ్ హౌజ్‌లను కాపాడుకోడానికే పేదలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్దమైన నిర్మాణాల జోలికి వెళ్లకుండా హైడ్రాకు ఆదేశాలిస్తున్నట్లు చెప్పారు. తాజాగా సీఎం రేవంత్ కామెంట్స్, ఆదేశాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చట్టబద్ధమైన అనుమతులతో వెంచర్లు ఏర్పాటు చేసుకున్నవారు హైడ్రా కూల్చివేతలకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. చెరువులకు సమీపంలో అనుమతులు ఉన్నా.. నిర్మాణాలు కూల్చివేస్తారని హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చెరువులకు సమీపంలో ఉన్న నిర్మాణాలకు అన్ని అనుమతులు సక్రమంగా ఉంటే కూల్చివేయమని సీఎం చెప్పారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంటుందని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. కాగా, హైడ్రా పరిధిని ఇటీవల విస్తరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి వరకు హైడ్రా పరిధిని విస్తరించారు. ప్రస్తుతం హైడ్రా కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిని నిర్ధారించిన తర్వాత కూల్చివేతలు చేపట్టనున్నట్లు తెలిసింది. అందుకు మరో మూడు నెలల సమయం పట్టనుండగా అప్పటి వరకు కూల్చివేతలు ఉండవని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నారు. ఇక హైదరాబాద్ నగరంలోని ట్రాఫిక్ కంట్రోల్‌కు హైడ్రాను భాగస్వామ్యం చేయనున్నారు. హైడ్రా సిబ్బందిని వినియోగించుకోనున్నారు. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ కంట్రోల్‌కు వాడుకోనున్నారు.

# గవర్నర్ దత్తాత్రేయ కాన్వాయ్‌కి ప్రమాదం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్‌కు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తున్న సమయంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం (అక్టోబర్ 20న) రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరిన బండారు దత్తాత్రేయ కాన్వాయ్‌కు అకస్మాత్తుగా ఓ వ్యక్తి అడ్డుగా వచ్చాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టాయి. ఇలా కాన్వాయ్‌లోని 3 వాహనాలు ఒక్కదానికొకటి వరుసగా ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో బండారు దత్తాత్రేయకు ఎలాంటి ప్రమాదం కాకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు గానూ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్తున్న సమయంలో ప్రధాన రహదారిలో ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు పాక్షికంగా ధ్వంసం కాగా వాహనాల్లో ఉన్న వ్యక్తులకు ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఏటా జరిపినట్టుగానే ఈసారి దసరా పండుగకు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అట్టహాసంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ప్రస్తుతం దత్తాత్రేయ గవర్నర్‌గా ఉండటంతో ఈ కార్యక్రమ బాధ్యతలను ఆయన తనయ విజయలక్ష్మి చూసుకుంటున్నారు. అయితే ఈసారి నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బండారు దత్తాత్రేయ తిరిగి ఆదివారం వెళ్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం సంభవించింది.

# ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్

రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ, తరచూ నిబంధనలతోపాటు రుణమాఫీ తేదీలను మారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, నియోజకవర్గంలోనూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ విషయంలో అబద్ధాలు, బూటకపు ప్రచారాలు మాత్రం ఆగడం లేదని కాంగ్రెస్ సర్కారు మండిపడ్డారు. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రజల్ని ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు మరో ఉద్యమం రావాల్సిందేనని అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగిన ఆలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి ఇప్పుడు ప్రజలను గోసపెడుతోందని హరీశ్ రావు విమర్శించారు. మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని రేవంత్ రెడ్డిని హరీశ్ రావు ప్రశ్నించారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి. చీఫ్ మినిస్టర్ కాదు చీటింగ్ మ్యాన్ అంటూ హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి లాంటి రాజకీయ నాయకుడిని ఇప్పటి వరకు చూడలేదని హరీశ్ రావు అన్నారు. జీవో 29 రద్దు చేయడమే గ్రూప్ 1 సమస్యకు పరిష్కారమన్నారు.

# పబ్బుల్లో గబ్బు పనులు

కొన్ని పబ్‌లు అనుమతులు తీసుకుని నిబంధనల మేరకు నడుస్తుంటే మరికొన్ని పబ్‌లు మాత్రం అనుమతులు లేకుండానే వెలిసి లోపల గబ్బు గబ్బు పనులకు అడ్డగా మారుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, అశ్లీల నృత్యాలతో పాటు కొన్నింట్లో ఓ అడుగు ముందుకేసి వ్యభిచారం లాంటి చీకటి వ్యవహారాలు కూడా నిర్వహిస్తున్నట్టు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్-3లోని టేల్స్ ఓవర్ ద స్పిరిట్స్ (టాస్) పబ్ చేసే గబ్బు పనులు వెలుగులోకి వచ్చాయి. పోలీసులకు వచ్చిన సమాచారంతో శుక్రవారం (అక్టోబర్ 18న) రోజున అర్ధరాత్రి 12 గంటలకు టాస్ పబ్ మీద పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో మద్యం మత్తులో ఊగిపోతున్న యువకులు, అర్ధనగ్న రీతిలో నృత్యాలు చేస్తున్న యువతులను పోలీసులు గమనించారు. మొత్తం 100 మంది యువకులతో పాటు 42 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ పబ్‌ను సీజ్ చేసిన పోలీసులు పట్టుబడినవారందరికీ నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు విచారణ జరపగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈమేరకు బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్ రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

టాస్ పబ్‌లో కొంతకాలంగా అమ్మాయిలను ఎరగా వేస్తూ అబ్బాయిలను ఆకర్షిస్తూ ఎక్కువ మద్యం తాగేలా చేసి అందినకాడిన దండుకుంటున్నట్టుగా ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. దీంతో దాడి చేసి పబ్ యజమానులు ఉప్పల్‌కు చెందిన డింగి బలరామ్‌గౌడ్, జగద్గిరిగుట్టకు చెందిన డింగి శ్రీనివాస్‌గౌడ్, మేనేజర్ అలీం, బార్ టెండర్ రామకృష్ణపై కేసులు నమోదు చేయగా పబ్ యజమానులు బలరాంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు పరారీలో ఉన్నట్టు చెప్తున్నారు. కాగా దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూసినట్టు వివరించారు.

అసలు టాస్ పబ్‌కు ఎలాంటి అనుమతి లేదని తేలింది. కాగా పబ్‌కు వచ్చిన అబ్బాయిలకు అమ్మాయిలను ఎరగా వేస్తున్నారు. అబ్బాయిలపై వలపు వల విసురుతూ వెర్రెత్తిస్తూ ఎక్కువ మద్యం తాగించేందుకు అమ్మాయిలను నియమించుకున్నారు. ఓ కస్టమర్‌ను రెచ్చగొడుతూ ఎంత ఎక్కువ బిల్లు చేయిస్తే అంత కమిషన్ ఇచ్చేలా డీల్ మాట్లాడుకుంటున్నారు. అమ్మాయిలకు కురచ దుస్తులు వేసి వారితో చనువుగా ఉండేలా ప్రోత్సహిస్తున్నారు. అందుకు రకరకాల ఓపెన్ ఆఫర్లు కూడా పెట్టారు. అమ్మాయి పక్కన కూర్చుంటే రూ.500, మీద చెయ్యి వేస్తే రూ.1000, సరసాలు ఆడితే రూ.1500 అర్ధనగ్నంగా మారి నృత్యాలు చేస్తే రూ.2,000 చెల్లించేలా రేట్లు కూడా ఫిక్స్ చేసినట్టుగా పోలీసుల దర్యాప్తులో తేలింది.

# జీవో నంబర్ 317పై తుది నివేదిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జీ.వో నంబర్ 317పై మంత్రి వర్గ ఉపసంఘం సీఎం రేవంత్ రెడ్డికి తుది నివేదిక అందజేసింది. ఈ జీవోను 2021 డిసెంబర్ లో తీసుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై కేబినెట్ సబ్ కమిటీ వేశారు. ఈ మంత్రి వర్గ ఉపసంఘాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు సభ్యులుగా ఏర్పాటు చేశారు. మంత్రి వర్గ ఉప సంఘం జీవోలోని సమస్యలపై పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలు, ఉన్నతాధికారులు, మేధావులతో సమావేశం అయింది. దీంతో పాటు ఆన్లైన్ ద్వారా ఉద్యోగుల అభిప్రాయాలను తీసుకుంది. ఈ జీవోపై సీఎం త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

డిసెంబర్ 2021లో జీవో 317 ఇచ్చారు. దీని ప్రకారం ఉద్యోగాల కేటాయింపులో జోనల్ వ్యవస్థను తీసుకొచ్చారు. 2016లో 10 నుంచి 31 కొత్త జిల్లాలుగా తెలంగాణ పునర్వ్యవస్థీకరించిన తర్వాత ఈ జీవో వచ్చింది. ఈ జీవో జిల్లా కేడర్ పోస్టులకు ఉద్యోగాలు, బదిలీలపై నిర్ణయం తీసుకునే కేటాయింపు కమిటీలో జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖాధిపతులు ఉండడానికి అవకాశం కల్పిస్తుంది. జోనల్, మల్టీజోనల్ పోస్టుల కోసం, నిర్ణయం ప్రిన్సిపల్ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ హెడ్, ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ సభ్యులుగా ఉండవచ్చు. భార్యాభర్తలు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వేర్వేరు కేడర్‌ల కింద పనిచేస్తుంటే, కేడర్ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ జీవో అవకాశం కల్పిస్తోంది.

ఈ జీవో ప్రకారం సాధ్యమైనంత వరకు, భార్యాభర్తలు ఒక స్థానిక కేడర్‌లో ఉంచుతారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతం-నిర్దిష్ట కేడర్ల కేటాయింపును జీవో పేర్కొనకపోవడంతో, ఉపాధ్యాయులతో పాటు, ఆదివాసీలు ఐదవ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు ఇచ్చిన రక్షణను పలుచన చేస్తారనే భయంతో ఆదివాసీలు ఈ జీవోపై నిరసన తెలిపారు.

# చికెన్ బిర్యానీలో కప్ప కళేబరం

కళేబరాన్ని ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం బహిర్గతమైంది. ట్రిపుల్ మెస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు కూడా విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే బయట ఫుడ్ తినాలంటేనే ప్రజలు జంకుతున్నారు. జంట నగరాల్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో నాణ్యతలేని ఆహార పదార్థాలు వాడుతున్నారంటూ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. వైన్ షాపుల వద్ద చికెన్ వంటకాలను అందించే స్టాళ్లకు సరఫరా చేసే ఓ స్టోరేజీ నుంచి సుమారు 700 కిలోల కుళ్లిపోయిన చికెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. నిర్వాహకులపై చర్యలు తీసుకున్నారు.

మరోవైపు, జంట నగరాల్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో పరిశుభ్రత ఉండటం లేదని, గడువు తీరిన పదార్థాలను వాడుతున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ హోటళ్లతోపాటు పలు ప్రముఖ హోటళ్లలోనూ పరిశుభ్రత, నాణ్యత అంతంత మాత్రంగానే ఉండటం చర్చనీయాంశంగా మారింది.

# పవన్ నిర్ణయంతో డబుల్ ధమాకా

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రూపొందించే కళాకారులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుభవార్త చెప్పారు. ఏటికొప్పాక బొమ్మల తయారీకి ముడి సరుకుగా ఉపయోగించే అంకుడు కర్ర, కొండపల్లి బొమ్మలకు అవసరమయ్యే తెల్ల పొనికి చెట్లను విస్తారంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ చెట్ల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ ఉండటంతో ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీదారులకు ముడిసరుకు దొరకడం కష్టంగా మారుతోంది. దీంతో ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల కళాకారులు ఈ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఈ చెట్లను రాష్ట్రంలో విస్తారంగా పెంచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఏటికొప్పాక, కొండపల్లి కళాకారులకు అందుబాటులో ఉండేలా అంకుడు, తెల్ల పొనికి చెట్లు పెంచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఇదే సమయంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ఈ చెట్లు పెంచాలని పవన్ కళ్యాణ్ సూచించారు. అటవీ ప్రాంతాలతో పాటుగా ఏటికొప్పాక, కొండపల్లి పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ, అటవీ, సామాజిక స్థలాల్లో అంకుడు, తెల్ల పొనికి చెట్లు పెంచడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో కనీసం రెండు మూడు తరాలకు సరిపడా చెట్లను పెంచేలా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మరోవైపు ఏపీలో హస్తకళలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే పవన్ కళ్యాణ్ అనేక చర్యలు తీసుకున్నారు. అతిథులకు అందించే బహుమతులుగా కూడా ఈ కళాకృతులనే అందిస్తున్నారు.

**పవన్ కళ్యాణ్ చెప్పిన చెట్ల విశేషాలివే..**

మరోవైపు పొనికి లేదా పొలికిగా ఈ చెట్టును పిలుస్తుంటారు. మనదేశంలో దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలలో పెరుగుతూ ఉంటుంది. కొండలు, గుట్టలలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. ఈ చెట్లలోనూ రెండు రకాలు ఉన్నాయి. తెల్ల పొనికి, అలాగే నల్ల పొనికి. తేలికగా, మృదువుగా ఉండటంతో పాటుగా ఎక్కువ కాలం మన్నే స్వభావం ఉండటంతో.. ఈ తెల్ల పొనికి చెట్టు కలపను బొమ్మల తయారీలో, నగిషీల తయారీలో వాడుతుంటారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలతో పాటుగా నిర్మల్ బొమ్మల తయారీలోనూ ఈ చెట్టు కలపను ఉపయోగిస్తారు. అయితే అడవుల నరికివేతతో పాటుగా ఈ చెట్టు విత్తనాలకు సహజంగా మొలకెత్తే స్వభావం కాస్త తక్కువగా ఉండటంతో చెట్ల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది.

# ఉలిక్కిపడ్డ దేశ రాజధాని

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలో కలకలం రేగింది. రోహిణి జిల్లా ప్రశాంత్ విహార్‌లోని సీఆర్పీఎఫ్ పాఠశాల బయట భారీ పేలుడు సంభవించింది. ఆదివారం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోగా పేలుడు తీవ్రతకు పాఠశాల ప్రహరీ గోడ ధ్వంసమైంది. స్కూల్ యాజమాన్యం వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, పేలుడికి కారణాలపై ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు. స్కూల్ ముందు నిలిపి ఉన్న ఓ కారుతో పాటు సమీపంలో ఉన్న ఓ షాపు ధ్వంసమైనట్టు పేర్కొన్నారు. భారీ శబ్దం రావడంతో ఏం జరిగిందా? అని చుట్టుపక్కల ఉండేవారు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. పేలుడు తర్వాత దట్టమైన పొగలు వెలువడ్డాయని స్థానికుడు ఒకరు చెప్పారు. దానిని అతడు తన మొబైల్‌లో వీడియో తీసినట్టు తెలిపాడు. 'నేను ఇంటిలో ఉండగా భారీ శబ్దం వచ్చింది బయటకు వచ్చి చూడగా పొగలు దట్టంగా అలుముకన్నాయి ఏం జరిగిందో నాకు తెలియదు పోలీసులు, అంబులెన్సులు అక్కడకు చేరుకున్నాయి.' అని అతడు అన్నాడు. సీనియర్ పోలీస్ అధికారి అమిత్ గోయల్ మాట్లాడుతూ ప్రశాంత్ విహార్‌లోని సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద ఉదయం 7.47 గంటలకు పేలుడు చోటుచేసుకుంది పేలుడకు కారణం ఏంటో తెలుసుకోడానికి నిపుణులతో దర్యాప్తు చేపట్టామని చెప్పారు. అయితే, ఇప్పటి వరకూ అక్కడ ఎటువంటి అనుమానిత వస్తువులు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. విచారణలో భాగంగా భూగర్భ మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తున్నట్టు వివరించారు. బాంబు స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు కూడా ఘటనా స్థలికి చేరుకుని, ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా, పేలుడు వెనుక క్రూడ్ బాంబు ఉండి ఉండొచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. మరికొద్ది సేపట్లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ టీమ్ కూడా అక్కడకు రానుంది. మోవైపు, పేలుడు ధాటికి సమీపంలోని ఇళ్ల కిటికీలు, కార్ల అద్దాలు, షాపుల బోర్డులు ధ్వంసమైనట్టు స్థానికులు తెలిపారు. ఢిల్లీలో పేలుళ్లకు ఉగ్రమూకలు వ్యూహరచన చేసినట్టు ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరికలు చేశాయి. ఈ తరుణంలో పేలుడు చోటుచేసుకోవడంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఎద్దు ఏడ్చినా ఏవుసం, రైతు ఏడ్చినా

# రాజ్యం బాగుపడదంటారు

**రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది**

**రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ వదిలేది లేదు**

**జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఈ ఖరీఫ్‌కు రైతు భరోసా లేనట్టే.. రైతు భరోసాపై సబ్ కమిటీ వేశాం.. ఆ కమిటీ రిపోర్ట్ వచ్చాక వచ్చే సీజన్ నుంచి రైతు భరోసా వేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి పార్టీ వర్కింగ్ మాజీమంత్రి ఎమ్మెల్యే కేటీఆర్ గారి పిలుపు మేరకు రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తాలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి బిఆర్ ఎస్ శ్రేణుల ఆద్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ధర్నా చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ వాన కాలం పంటకి రైతు భరోసా కింద ఎకరానికి 7500 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు పక్ష నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఎన్నికలలోఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను నిలువునా మోసం చేస్తోందన్నారు. ఎకరానికి 7, 500 రైతులకు పెట్టుబడి సాయంకింద ఇవ్వకుండా రైతులకు కన్నీళ్లు పెట్టిస్తున్నారని పేర్కొన్నరు.అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ కు ఉసురు తప్పదు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం చెబుతున్నారన్న కేసీఆర్ గారి మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసింది అని అన్నారు. వానాకాలం పంట సీజన్ కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసింది. లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టింది. ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారు. మీ చేతగానీ తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదు. సబ్ కమిటీ, గైడ్ లైన్స్ అంటూ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడతామంటే రైతులు వీపు చింతపండు చేస్తారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు స్టార్ట్ చేశారు.పచ్చి అబద్ధాలు, మోసాలతో రైతులను దగా చేశారు. కాంగ్రెస్ పార్టీ దగాకోరు మాటలు నమ్మి గెలిపించిన రైతులను అరిగోస పెడుతున్నారు.రైతులతో చెలగాటమాడితే మాడి మసి అవక తప్పదు. రుణమాఫీ మోసం చాలదన్నట్లు...ఇప్పుడు రైతు భరోసాలోనూ దగానే.ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి. జగపతి, తాజా మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ.ఆంజనేయులు, కో కన్వీనర్లు కృష్ణ గౌడ్, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజ్ ఆర్ కె శ్రీనివాస్, విశ్వం, సుంకయ్య,మాజీ కౌన్సిలర్లు చంద్రకళ, సలాం, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, నాయకులు ప్రభు రెడ్డి,కిష్టయ్య, లక్ష్మి నారాయణ,కిషన్,గౌస్, శ్రీకాంత్,రవి, పాపయ్య, మోహన్,జగదీష్, కృష్ణ, అమీర్, నరేందర్ రెడ్డి, ఇస్మాయిల్,ఫాజిల్,సంజీవ రెడ్డి, సాప. సాయిలు, ప్రభు, లింగం,మధు, పవన్, రాములు, రంజిత్,కిరణ్, భువన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# సంకష్టహర చతుర్థి ఎంతో పర్వ దినము

## - శ్రీ విఘ్నేశ్వరున్ని దర్శించుకున్న భక్తులు

మంథని ( ప్రశ్న న్యూస్) సంకష్టహర చతుర్థి పర్వదినమున పురస్కరించుకొని ఆదివారం శ్రీ విఘ్నేశ్వర ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని పట్టణంలోని శ్రీ మహాగణపతి దేవాలయంలో భక్తు విశేశ సంఖ్యలో స్వామివారి దర్శించుకున్నారు.

భాద్రపదమాసంలో శుద్ధచతుర్థినాడు మాత్రమే వినాయక పూజ చేస్తే చాలా శ్రేష్టమైనది. వాస్తవానికి ప్రతి నెలలో వచ్చే రెండు చతుర్థులు వినాయకునికి పూజ చేయాలి. పూర్ణిమ తరువాత వచ్చే కృష్ణ చతుర్థి రోజున చేసే వినాయక పూజను సంకష్టహర చతుర్థినాడు చేసే వినాయక పూజను సంకష్టహర చతుర్థి అని వ్యవహరిస్తారు.

సంకష్టహర చతుర్థి రోజు ఉపవాసము ఉంటే అన్ని రకముల కష్టములను పోగొట్టి శుభ లాభములను కలిగించును.

గణనాథునికి ఇష్టమైన ఉండ్రాళ్లు మొదలైన వానిని నివేదించాలి.

గణపతికి చంద్రునికి చతుర్థీ తిధికి రోహిణీ నక్షత్రానికి అర్ఘ్యం యీయవలెను. గణపతి అనుగ్రహంచేత సర్వకార్యాలూ సానుకూలమవుతాయి.

అన్ని సంకటాలూ దూరమవుతాయి. కలియుగంలో గణపతి, దుర్గ-వెంటనే అనుగ్రహించే దేవతలు అని శాస్త్రవచనము (కలౌ చండీ వినాయకౌ).

### -చతుర్థీపూజనప్రీతః' అని గణపతి నామం.

చతుర్థీ (చవితి) తిథి గణపతికి ప్రీతి, ఆ తిథి రోజున ఆయన ఉద్భవించాడు. సృష్టి హేతువైన 'పరబ్రహ్మం' ఒక్కటే, అదే జగత్కల్యాణార్థమై గణపతిగా, విష్ణువుగా, శివునిగా, శక్తిగా, సూర్యునిగా, స్కందునిగా వివిధ రూపాలు ధరించింది. ఒక్కోనామం, ఒక్కొరూపం, వాటి ఉపాసనా విధానం ప్రత్యేక ఫలాలనిస్తాయి.

### భాద్రపదశుద్ధ చవితి 'వినాయక చవితి'గా మనం గణపతిని పూజిస్తాం, కానీ ప్రతి చవితి గణపతికి ప్రీతికరమే.

భాద్రపదశుక్ల చవితి రోజున గణపతి పార్వతీ పరమేశ్వరులకు కుమారునిగా అవతరించిన రోజు. కాని అంతకుముందే గణపతి ఉన్నాడు. ఆయన ఉపాసన ఉంది.

బ్రహ్మదేవుడు సృష్ట్యాదిలో సృష్టి నిర్వహరణకు కలిగే విఘ్నాలను చూసి భీతిల్లి, పరబ్రహ్మను ప్రార్థించాడు.

ప్రణవ (ఓంకారం) స్వరూపుడైన ఆ పరమాత్మ విఘ్నాలను నశింపజేసేందుకు గజవదనరూపంతో సాక్షాత్కరించి తన వక్రతుండ మంత్రాన్ని బ్రహ్మకు ఉపదేశించి, విఘ్నాలను హరింపజేశాడు.

ఇది ప్రథమ ఆవిర్భావం, వక్రతుండస్వరూపం, అనేకానేక అవతారాలుగా గణపతి రూపాలు బహువిధాలు అని పురాణ వ్మాయం తంత్రశాస్త్రం వివరిస్తోంది. సర్వదారిద్ర్యాలు, భయరోగాది కష్టాలూ హరింపజేసే గణపతికి ప్రీతికరంగా చతుర్థీవ్రతం చెప్పారు.

ముఖ్యంగా 'కృష్ణపక్షం'లో వచ్చే 'చతుర్థి' చాలా ముఖ్యం. ప్రతినెలా ఆ చతుర్థికి గణపతిని ఉద్దేశించి ఉపవాసమో, లేదా ఉండ్రాళ్లు మోదకాలు వంటివి నివేదించడమో చేయాలి.

కృష్ణ చతుర్థినాడు దూర్వలతో, బిల్వాలతో, పుష్పాలతో గణపతిని అర్చించి, ఏకవింశతి (21) ఉండ్రాళ్లు నివేదన చేస్తే గ్రహదోషాలూ, గృహదోషాలు, అన్ని యీతి బాధలూ తొలగుతాయి..

ఈ కృష్ణచతుర్థులలో ప్రముఖమైనదీ, మహామహిమాన్విత మైనది. మాఘ మాసంలో- అంటే ఈ నెలలో వచ్చే కృష్ణచతుర్థి. కృష్ణచతుర్థి వ్రతానికి చంద్రోదయంతో చవితి తిథి ఉండాలి. ఆరోజు ఉదయాన్నే లేచి - గణపతిని స్మరించి, "ఈరోజున నీవ్రతాన్ని చేయదలచుకున్నాను" అని సంకల్పించుకొని, స్నానాది నిత్యనైమిత్తిక కర్మలుచేసి, గణపతి స్తోత్రంతో, ధ్యానంతో, స్మరణతో గడపాలి. ఉపవాసం పూజ చేయడంకూడా ఉత్తమం. సాయంత్రం చంద్రోదయంతో గణపతిని షోడశోప చారాలతో పూజించి, ఉండ్రాళ్లు, లడ్లు, మోదకాలు, బెల్లం కలిపిన పదార్థాలు శక్త్యాను సారం నివేదించాలి. పూజానంతరం-శాంతచిత్తాన 'శ్రీగణేశాయనమః' అనేనామాన్ని 21 సార్లు జపించాలి. గణపతి మంత్రోపదేశం ఉన్నవారు ఆఉపదేశమంత్రాన్ని జపించాలి.

శ్లో? గణేశాయ నమస్తుభ్యం సర్వసిద్ధి ప్రదాయక సంకష్టహర మే దేవ గృహాణార్ఘ్యం నమోస్తుతే కృష్ణపక్షే చతుర్థ్యాంతు సంపూజిత విధూదయే క్షిప్రం ప్రసీద దేవేశ గృహాణార్ఘ్య నమోస్తుతే? 1

పై శ్లోకాలు చదివి "సంకష్టహరణ గణపతయే నమః"అని చెప్పి రెండుసార్లు అర్ఘ్యమివ్వాలి. తరువాత-ఈక్రింది మంత్రంతో 'చతుర్థి తిథి అధిష్ఠాత్రీదేవీ'కి అర్ఘ్యమివ్వాలి.

శ్లో? తిథీనాముత్తమే దేవి గణేశప్రియవల్లభే సర్వసంకట నాశాయ గృహాణార్ఘ్యం నమోస్తుతే? 'చతుర్థ్యై నమః' ఇదమర్ఘ్యం సమర్పయామి %శ్రీశ్రీ 2

%తరువాత ఈ క్రింది మంత్రంతో చంద్రునికి చందన కుసుమాక్షతలు, పెరుగు కలిపిన రాగిపాత్రలోని నీటిని అర్ఘ్యం ఇవ్వాలి.

శ్లో? గగనార్ణవమాణిక్య చంద్ర దాక్షాయణీపతే? గృహాణార్ఘ్యం మయాదత్తం గణేశప్రతిరూపక?

ఈ చవితినే 'సంకష్టహర చతుర్థి'లేదా 'వక్రతుండ చతుర్థి'అంటారు.

'యం యం కామయతే యోవైతం తమాప్నోతి నిశ్చితం అని పురోణోక్తి.

ఏ కోరికతో ఈ వ్రతాన్ని చేస్తే, ఆ కోరిక తప్పకుండా నెరవేరుతుంది.

### శ్రీ మహాగణపతియే నమః

చతుర్థ్యాం శుక్లపక్షశ్చ స్థితాయాం సర్వదా జనాః, నిరాహారేణ మాం తత్ర త్వద్భక్తం పర్యుపాసతే చతుర్విధం ఫలం తైశ్చ సంప్రాప్తం నాత్ర సంశయః, యద్యదిచ్ఛతి తత్తత్ స లభతే



వ్రతకారకః అంతే స్వానందగో భూత్వా సాయుజ్యం బ్రహ్మణస్తథా.

### -చంద్రుడి అర్ఘ్య శ్లోకాలు

1. ఫాలచంద్ర నమస్తుభ్యం భక్తానాం భద్రదాయక! గంధ పుష్ప ఫలైర్యుక్తం గృహాణార్ఘ్యం మయార్పితం !!
2. క్షీరోదార్ణవ సంభూత అత్రినేత్ర సముద్భవ ! గృహాణార్ఘ్యం మయాదత్తం రోహిణ్యా సహిత ప్రభో!!
3. నమస్తే రోహిణీషాయ సుధారూప నిశాకర! గృహాణార్ఘ్యం మయాదత్తంరమానుజ నమోస్తుతే!!

చతుర్థి మంచి పనులకు, వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రతికూలమైన రిక్త తిథి. చతుర్థి శత్రువుల నాశనానికి, పోరాట చర్యలు చేపట్టడానికి, ఇంటిని, వస్తువులను శుభ్రపరచడం, వాదనలు, గొడవలు, ఆయుధాలు ఉపయోగించడం వంటి పనులకు మత్రమే అనుకూలమైన తిథి.

చతుర్థి తిథి, గణపతి దేవాలయాలు సందర్శించడానికి, గణపతి స్తోత్రాలు, మంత్రాలు పఠించడానికి అత్యంత శుభప్రదమైన రోజు.

# స్మారక కార్యక్రమంలో స్నాక్స్ తిని.. 200 మందికిపైగా అస్వస్థత




గౌహతి: స్మారక కార్యక్రమానికి హాజరైన వారు అక్కడ సర్వ్ చేసిన స్నాక్స్ తిన్నారు. అనంతరం 200 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల కడుపు నొప్పి, తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలతో ఆసుపత్రిపాలయ్యారు. అస్సాంలోని గోల్‌ఘాట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సరుపతర్ ప్రాంతం ఉరియమ్‌ఘాట్‌లోని పాస్‌ఘోరియా గ్రామంలో ప్రదీప్ గొగోయ్ తల్లి స్మారక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అతిథులకు సాంప్రదాయ 'జల్పాన్', పఫ్డ్ రైస్, క్రీమ్‌తో కూడిన స్నాక్స్ ఇచ్చారు. అది తిన్న సుమారు 200 మందికిపైగా వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలతో ఇబ్బందిపడ్డారు.కాగా, 53 మందిని సరుపత్తర్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఉరియమ్‌ఘాట్‌లోని పబ్లిక్ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని జోర్హాట్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. స్వల్ప లక్షణాలున్న 150 మందికి ప్రాథమిక చికిత్స తర్వాత ఇళ్లకు పంపివేశారు. మరోవైపు ఆ గ్రామాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సందర్శించి ఫుడ్ పాయిజన్ కారణాలను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫంక్షన్‌కు వచ్చిన వారందరి ఇళ్లకు వైద్య బృందాలను పంపి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తామని వెల్లడించారు.

# 2028 లోపు మళ్లీ కర్ణాటకకు ముఖ్యమంత్రిని అవుతా

**- హెచ్‌డీ కుమారస్వామి**



భారత మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. 2028 లోపు తాను మళ్లీ కర్ణాటక ముఖ్యమంత్రి అవుతానని పేర్కొన్నారు. ప్రస్తుతం కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత కలహాలవల్ల ప్రభుత్వం పతనమవుతదని ఆయన జోస్యం చెప్పారు. ప్రజలు కోరుకుంటే తాను ముఖ్యమంత్రిని అవుతానని, వారు తనకు మరో అవకాశం ఇస్తారని నమ్ముతున్నానని కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. 2028లోపు ప్రజల మద్దతుతో సీఎంగా బాధ్యతలు చేపట్టి, మరింత అద్భుతంగా పని చేస్తానని పేర్కొన్నారు. గతంలో కర్ణాటక సీఎంగా తాను చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలే సర్కారును పడగొడతారని కుమారస్వామి అన్నారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు ఎమ్మెల్యేల పట్ల ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ నేతల్లో పెరిగిపోతున్న అసంతృప్తి పార్టీకి నష్టం చేస్తుందని, త్వరలోనే ఆ విభేదాలు బయటకు వస్తాయని అన్నారు. అప్పటి వరకు తాను వేచి చూడాల్సిందేనని కుమారస్వామి వ్యాఖ్యానించారు. కాగా 2006 - 2007, 2018 మే నుంచి 2019 జూలై వరకు కుమారస్వామి రెండుసార్లు కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు పర్యాయాలు సంకీర్ణ సర్కారుకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన కేంద్ర ఉక్కుశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# జగిత్యాల జిల్లాలో దారుణం.. అన్నను తల్వార్‌తో నరికి చంపిన తమ్ముడు



జగిత్యాల : జగిత్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తి కోసం సొంత అన్ననే తమ్ముడు దారుణంగా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్లెపు సాయిలు, పల్లెపు చందు ఇద్దరు అన్న దమ్ములు. కాగా, ఆస్తి విషయంలో ఇద్దరు సోదరుల మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. మరోసారి ఆస్తి విషయంలో గొడవ తలెత్తడంతో కోపోద్రిక్తుడైన చందు గ్రామ శివారులో సాయిలును తల్వార్‌తో నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు యువకుల రిమాండ్



యాచారం, అక్టోబర్20 : అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు యువకులను హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన సురేష్‌కుమార్, దినేష్‌కుమార్, సునీల్‌కుమార్ గత కొంతకాలంగా నగరంలోని నాదర్‌గుల్‌లో నివాసముంటున్నారు. నిషేదిత డ్రగ్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలను గడిస్తున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందుకూరు మండలం బేగరికంచె సమీపంలోని అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్న లేబర్‌కు ముగ్గురు యువకులు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ముగ్గరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసినా, విక్రయించినా, స్వీకరించినా క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

# గిరిజనుల హక్కులపై మీ వైఖరేంటి.. బీజేపీని నిలదీసిన కల్పనా సోరెన్



గిరిజనుల హక్కులు, డిమాండ్ల పరిష్కారంతోపాటు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలు చేసే సత్తా ఉందా? అని బీజేపీకి జార?ండ్ ముక్తి మోర్చా ఎమ్మెల్యే కల్పనా సోరెన్ సవాల్ విసిరారు. సర్నా ఆధ్యాత్మిక కోడ్ అమలు చేయాలన్న గిరిజనుల డిమాండ్ కు మద్దతునిస్తుందా? అని బీజేపీని ఆమె ప్రశ్నించారు. త్వరలో జార?ండ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ధన్‌బాద్ జిల్లాలోని తుండిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ బీజేపీ బూటకపు హామీల బుట్టలో జార?ండ్ ప్రజలు పడబోరని స్పష్టం చేశారు. బీజేపీకి ధైర్యం ఉంటే సర్నా ఆధ్యాత్మిక కోడ్ అమలు చేయాలన్న గిరిజనుల హక్కుల డిమాండ్ మీద ఆ పార్టీ వైఖరేమిటో చెప్పాలని కల్పనా సోరెన్ డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలుపై బీజేపీ వైఖరేమిటో చెప్పాలన్నారు. జార?ండ్ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సీఎం హేమంత్ సోరెన్ ఒక్కరేనన్నారు. వచ్చేనెల 13, 20 తేదీల్లో జార?ండ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. వచ్చేనెల 23న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# మేం త్యాగాలకు సిద్ధంగా లేం.. 12 సీట్లైనా ఇవ్వాల్సిందే.. జారండ్‌లో సీట్ల పంపకంపై ఆర్జేడీ



జారండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో అధికార జేఎంఎం-కాంగ్రెస్ పార్టీల కూటమి సీట్ల పంపకంపై ముమ్మర కసరత్తు చేస్తోంది. జారండ్‌లోని మొత్తం 81 స్థానాలకుగాను కాంగ్రెస్, జేఎంఎం కలిసి 70 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించడంపై ఆ కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆర్జేడీ అసంతృప్తి వ్యక్తంచేసింది. సీట్ల పంపకాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని స్థానిక ఆర్జేడీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆర్జేడీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు మనోజ్ కుమార్ ఝా మాట్లాడుతూ.. తమకు 12 కంటే తక్కువ సీట్లు ఇస్తే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఒకవేళ తాము ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చినా ఇండియా కూటమి అవకాశాలను దెబ్బతీయబోమని చెప్పారు. 12-13 సీట్ల కంటే తక్కువైతే తమకు ఆమోద యోగ్యం కాదని, మా పార్టీకి 18-20 స్థానాల్లో బలం ఉందని చెప్పారు. కేవలం మూడు నాలుగు స్థానాల్లో పోటీ చేయాలంటే కుదరదని, తాము త్యాగాలకు సిద్ధంగా లేమని అన్నారు.తమ ఏకైక లక్ష్యం బీజేపీని ఓడించడమేనని చెప్పారు. ఇండియా కూటమిని తాము విచ్ఛిన్నం చేయమని, ఒకవేళ ఒంటరిగా పోటీచేయాలని తమ పార్టీ నిర్ణయిస్తే.. 60-62 స్థానాల్లో కూటమి అభ్యర్థులకే మద్దతిస్తామని మనోజ్‌కుమార్ ఝా చెప్పారు. గత ఎన్నికల్లో ఆర్జేడీ ఏడు సీట్లలో పోటీ చేసి కేవలం ఒకే చోట గెలుపొందింది. ఆ పార్టీకి చెందిన సత్యానంద్ భొక్త ప్రస్తుతం హేమంత్ సోరెన్ క్యాబినెట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు. సీట్ల పంపకాలపై మంత్రి మాట్లాడుతూ.. గతంలో తాము గెలిచిన సీట్లే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

# రాత్రివేళ నిద్రలేపి.. హాస్పిటల్‌లో ఉన్న కంటి రోగులకు బీజేపీ సభ్యత్వం

అహ్మదాబాద్: హాస్పిటల్‌లోని కంటి రోగులను ఒక వ్యక్తి రాత్రి వేళ నిద్ర లేపాడు. మొబైల్ ఫోన్‌లో వారి వివరాలు నమోదు చేసి బీజేపీ సభ్యులుగా చేర్చుకున్నాడు. ఒక రోగి రికార్డ్ చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో ఈ సంఘటన జరిగింది. రాజ్‌కోట్‌లోని రాంచోడ్ దాస్ ట్రస్ట్ హాస్పిటల్ వార్డులో కంటికి శస్త్ర చికిత్స కోసం సుమారు 350 మంది రోగులు ఉన్నారు. రాత్రివేళ వారు నిద్రిస్తుండగా ఒక వ్యక్తి ఆ వార్డులోకి వచ్చాడు. మొబైల్ ఫోన్‌లో వారి వివరాలు నమోదు చేశాడు. వారి మొబైల్‌కు ఓపీటీ వచ్చింది. ఆ తర్వాత 'మీరు బీజేపీ సభ్యులయ్యారు' అన్న మెసేజ్ అందింది. ఒక రోగి దీని గురించి నిలదీయగా 'బీజేపీ సభ్యత్వం లేని వారిని ఎవరూ రక్షించరు' అని ఆ వ్యక్తి సమాధానమిచ్చాడు. కాగా, ఆ వార్డులోని ఒకరు మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గుజరాత్ బీజేపీ ఉపాధ్యక్షుడు గోర్ధన్ జడాఫియా దీనిపై స్పందించారు. ఈ సంఘటనకు తమ పార్టీ ప్రమేయం లేదని తెలిపారు. ప్రజలను ఈ విధంగా బీజేపీలోకి చేర్చుకోమని ఎవరినీ ఆదేశించలేదని చెప్పారు. ఒకవేళ ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నట్లయితే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# కొన ఊపిరితో ఉన్న పాముకు సీపీఆర్ చేసి బతికించిన యువకుడు..

సాధారణంగా మనం పామును చూస్తేనే భయంతో పరుగులు తీస్తాం. మళ్లీ ఆ వైపు కన్నెత్తి కూడా చూడం. అలాంటిది ఓ యువకుడు మాత్రం ఏకంగా పాముకే సీపీఆర్ చేసి ప్రాణం పోశాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పామును చేతిలో పట్టుకుని రెండు మూడు నిమిషాలపాటు ఊపిరి ఊదాడు. దాంతో పాముకు పోతుందనుకున్న ప్రాణం తిరిగి వచ్చింది. గుజరాత్‌లోని వడోదరలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకూ ఆ వీడియోలో ఏముందంటే.. ఒక అడుగు పొడవున్న విషపూరిత పాము అపస్మారక స్థితిలో పడివుంది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న వన్యప్రాణి సంరక్షకుడు యశ్ తాడ్వి ఆ పామును చేతపట్టుకుని, దాని నోరు తెరిచి సీపీఆర్ ఇవ్వడం ప్రారంభించాడు. మొదట పాము ఎలాంటి కదలిక లేకుండా బతికేలా కనిపించకపోయినా.. దాదాపు ఓ 3 నిమిషాల తర్వాత కదలడం మొదలు పెట్టింది. పాము స్పృహలోకి వచ్చిన తర్వాత దాన్ని పునరావాసం కోసం స్థానిక అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

# సంస్కారాలు



గృహస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# వజ్రాల సీతాకోక చిలుకల బ్యాగు.. విలువెంతో తెలుసా!



రోమ్: సాధారణంగా ఓ హ్యాండ్ బ్యాగు ఖరీదు 500 రూపాయల నుంచి ప్రారంభమై వేలల్లో ఉంటుంది. ఇక కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్స్‌కు చెందిన ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగుల విలువ లక్షల్లో ఉంటుంది. కానీ ఇటలీకి చెందిన ఓ బ్యాగుల కంపెని ఇటీవల తయారు చేసిన బ్యాగు విలువ తెలిస్తే అందరూ నోళ్లు వెళ్లబెట్టాల్సిందే. అలిగేటర్(మొసలి జాతికి చెందిన) చర్మంతో తయారు చేసిన ఈ చిన్న బ్యాగు విలువ రూ. 53 కోట్లు అంట. దీంతో ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అంత్యంత ఖరీదైన బ్యాగు అయ్యింది. అయితే దానికి ఎందుకు అంతా ఖరీదు అని ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్యాగును వజ్రాలు, మరకత మాణిక్యాలతో పాటు విలువైన రాళ్లతో అలంకరించారు. దీనిని బోరిని మిలానేసి అనే లగ్జరీ లెదర్ హ్యాండ్ బ్యాగుల కంపెనీ తయారు చేసింది. చూడగానే కళ్లు చెదరిలా తయారు చేసిన ఈ బ్యాగును అలిగేటర్ చర్మంతో తయారు చేసిన ఈ బ్యాగుపై తెల్లరంగు బంగారంతో తయారు చేసిన 11 సీతాకోక చిలుకలను అమర్చారు. ఈ సీతాకోక చిలుకలపై మొత్తం 30 క్యారట్ల వజ్రవైఢూర్యాలు, అరుదైన మరకత మాణిక్యాలను పొదిగారు. అయితే ఈ బ్యాగు తయారు చేసేందుకు దాదాపు 1000 గంటలకు పైగా సమయంలో పట్టిందని ఈ సంస్థ వెల్లడించింది. దీనితోపాటు ఇలాంటివే మరో రెండు బ్యాగులను కూడా ఈ సంస్థ తయారు చేసింది. కాగా ఖరీదైన ఈ హ్యాండ్ బ్యాగులను మహాసముద్రాల కాలుష్యంపై అవగాహన కలిగించేందు కోసమే తయారు చేసినట్లు బోరిని మిలానేసి సంస్థ తెలిపింది. వీటి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును సముద్ర కాలుష్య నివారణకు వినియోగిస్తామని ఈ సంస్థ వెల్లడించింది. అయితే దీనిని ఇంతవరకు ఎవరూ ఖరీదు చేయలేదని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచలోనే అంత్యంత ఖరీదైన ఈ బ్యాగును ఏ సంపన్నులు సొంతం చేసుకుంటారో వేచి చూడాలి.

# పుష్కరతుంగ... భద్రగంగ



జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్య ప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జలస్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు. 'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో వరాహరూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలాజలం భద్రానదిగానూ ఉద్భవించాయి. పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి. రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర.. కర్ణాటక: శృంగేరి (చిక్మగుళూరు), పంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి). ఆంధ్రప్రదేశ్: రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల). తెలంగాణ: సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం. తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

# చేపలో ఎన్ని పోషాకాలున్నాయో.. తెలుసా...?

హైదరాబాద్ : చేపల పులుసే కాదు, చేపల వేపుడు కూడా అద్భుతంగానే ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో చేపలను వారంలో కనీసం 2 లేదా 3 సార్లు తీసుకుంటే మనకు అనేక అద్భుతమైన లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.వయస్సు మీద పడడం వల్ల ఎవరికైనా సహజంగానే మతిమరుపు వస్తుంటుంది. కొందరికి ఇది తీవ్రతరమై అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అలాంటి సమస్య ఉన్నవారు చేపలను తినడం వల్ల ఆ సమస్య నుంచి బయట పడవచ్చని 2016లో పలువురు అమెరికన్ సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. చేపలను తినడం వల్ల మెదడు బాగా పనిచేస్తుందట. జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారు చెబుతున్నారు.–చేపలను బాగా తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ఓ అధ్యయన వివరాలను ప్రచురించారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. –చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. –చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. అలాగే పెద్దపేగు, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లు రాకుండా ఉంటాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఓ అధ్యయ వివరాలను ప్రచురించారు.



# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)

- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు) - ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిసృపాలు, చేపల సంతతి

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.

**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గుదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ –2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%––%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు.ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%––%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %––%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది. ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం



# సక్సెస్ బాటలో 'లవ్ రెడ్డి' ఫెయిల్యూర్ మీట్...

## లవ్ రెడ్డి టీమ్‌కు ప్రభాస్ సపోర్ట్!

అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా నటించిన చిత్రం లవ్ రెడ్డి. స్మరణ్ రెడ్డి దర్శకత్వంలో సునంద బి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్ జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డిలు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే తమ చిత్రాన్ని ప్రేక్షకులకు రీచ్ చేయడంలో తాము ఫెయిల్ అయ్యామని చిత్ర యూనిట్ డిఫరెంట్‌గా ఫెయిల్యూర్ మీట్‌ను నిర్వహించింది. తాము సినిమాను ప్రేక్షకులకు చేరువ చేయడంలో సక్సెస్ కాలేదని అందుకే ఈ ఫెయిల్యూర్ మీట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమకు సినీ పరిశ్రమలోని హీరోలు, ప్రముఖుల సపోర్ట్ ఉంటే ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల దగ్గర తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, ఇందుకు తమకు సినీ ప్రముఖుల సపోర్ట్ కావాలని చిత్ర యూనిట్ ఈ ఫెయిల్యూర్ మీట్‌లో అభ్యర్థించింది. కాగా, ఈ ప్రెస్‌మీట్ పట్ల ప్రముఖ కథానాయకుడు ప్రభాస్ స్పందించారు. . ఈ క్రమంలోనే ప్రభాస్.. లవ్ రెడ్డి చిత్రాన్ని ప్రొత్సహిస్తూ ఇన్ స్టా వేదికగా తన సపోర్ట్ ప్రకటించారు. లవ్ రెడ్డి చిత్రానికి సంబంధించి ఎన్నో మంచి విషయాలు వింటున్నానని, ఇటీవల కాలంలో విడుదలైన ప్రేమ కథల్లో లవ్ రెడ్డి మంచి చిత్రంగా నిలువడం ఆనందంగా ఉందని ప్రభాస్ ఈ పోస్ట్‌లో తెలిపారు. ఈ మేరకు ఇన్ స్టాలో తన అభిమానుల కోసం లవ్ రెడ్డి ట్రైలర్ ను షేర్ చేస్తూ ఆ చిత్రానికి సపోర్ట్‌గా ఉండాలని ప్రభాస్ కోరారు. ఇప్పటికే ఈ చిత్రానికి హీరో కిరణ్ అబ్బవరం ముందుకొచ్చి తెలుగు రాష్ట్రాల్లో 4 స్పాన్సర్ షోలు వేసి మద్దతు తెలిపాడు. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా కథానాయకుడు లవ్ రెడ్డి చిత్రానికి అండగా నిలవడం పట్ల చిత్ర బృందం సంతోషంలో ఉంది. ప్రభాస్ లవ్ రెడ్డి చిత్రానికి మద్దతుగా నిలువడం పట్ల సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. సో.. లవ్ రెడ్డి టీమ్ వినూత్నంగా నిర్వహించిన ఫెయిల్యూర్ మీట్‌కు జెన్యూన్ రెస్పాన్స్ వస్తోంది. రానున్న రోజుల్లో ఈ చిత్రానికి మరి కొంత మంది సినీ ప్రముఖులు సపోర్ట్ నిలిచే అవకాశం ఉంది.

# సింగిల్ షాట్‌లో 18 నిమిషాల సీన్..
# విక్రమ్ వీరధీరసూరన్‌పై సూరజ్ వెంజరమూడు



ఈ ఏడాది తంగలాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్. ఈ విలక్షణ నటుడు హీరోగా నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ వీరధీరసూరన్ ఛియాన్ 62గా వస్తోన్న ఈ మూవీని చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, మాలీవుడ్ యాక్టర్ సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ చిట్‌చాట్‌లో సూరజ్ వెంజరమూడు చేసిన కామెంట్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. సినిమాలో ఓ స్పెషల్ సీన్ గురించి సూరజ్ వెంజరమూడు మాట్లాడుతూ.. విక్రమ్, ఎస్‌జే సూర్య, నాపై ప్రత్యేకంగా ఓ సీన్ ఉంటుంది. ఈ సన్నివేశం మొత్తాన్ని 18 నిమిషాల వ్యవధిలో సింగిల్ షాట్‌లో చేయడం చాలా ఎక్జయిటింగ్‌గా అనిపించే విషయం. నేను ఇదివరకెన్నడూ ఇలాంటి సన్నివేశాన్ని ఎక్స్‌పీరియన్స్ చేయలేదన్నాడు. సూరజ్ వెంజరమూడు చేసిన ఈ వ్యాఖ్యలు వీరధీర సూరన్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఇప్పటికే దుషారా విజయన్ లుక్ కూడా రిలీజ్ చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. విక్రమ్ ఈ సారి పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ సినిమాతో వినోదాన్ని అందించబోతున్నాడని టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. వీరధీర సూరన్ చిత్రాన్ని 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు కోలీవుడ్ సర్కిల్ టాక్.

## ఓటీటీలోకి వచ్చేసిన 'ఉరుకు పటేలా'..
# స్ట్రీమింగ్ ఎక్కడంటే.?



'హుషారు' సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు టాలీవుడ్ యువ కథానాయకుడు తేజాస్ కంచర్ల. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. గెట్ ఉరికిఫైడ్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాకు వివేక్‌రెడ్డి దర్శకత్వం వహించగా.. కంచర్ల బాలభాను నిర్మించాడు. వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతా రాణించలేదు. అయితే తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది.ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణ బ్యాక్ డ్రాప్‌తో ఒక పల్లెటూరిలో తీసిన థ్రిల్లర్ కామెడీ మూవీ ఇది.

ప్రేమించిన అమ్మాయి తన ప్రియుడి కుటుంబాన్ని.. అతడిని ఎందుకు చంపాలనుకుంటుంది అనేది స్టోరీ. ఈ సినిమాలో ఖుష్బూ చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, నిర్మాణం: లీడ్ ఎడ్జ్ పిక్చర్స్.

# థియేటర్లలో నో రెస్పాన్స్ ..
## డబుల్ ఇస్మార్ట్‌కు టీవీల్లో రియాక్షన్ ఎలా ఉంటుందో మరి..?



పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని టైటిల్ రోల్‌లో నటించిన సీక్వెల్ ప్రాజెక్ట్ డబుల్ ఇస్మార్ట్ కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. అయితే ఎవరూ ఊహించని విధంగా లైగర్ తర్వాత మరో ఫెయిల్యూర్‌గా పూరీ ఖాతాలో పడిపోయింది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోని ఈ చిత్రం ఇక టెలివిజన్ ప్రేక్షకుల దగ్గర తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. ఈ యాక్షన్ డ్రామా అక్టోబర్ 27న (ఆదివారం) జీ తెలుగు సాయంత్రం 6 గంటలకు ప్రీమియర్ కానుంది.మరి టీవీ ఆడియెన్స్ ఈ చిత్రాన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారనేది చూడాల్సి ఉంది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటించగా.. షాయాజీ షిండే, అలీ, గెటప్ శ్రీను ఇతర కీలక పాత్రల్లో నటించారు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కించింది.

# ఇద్దరు ప్రముఖ హీరోలు నన్ను మూడేళ్ల పాటు బాయ్‌కాట్ చేశారు: సీనియర్ నటి జమున



అలనాటి తెలుగు సినీ తారల్లో సీనియర్ నటి స్వర్గీయ జమునాది ఓ ప్రత్యేక స్థానం. ఆమె నటనకు ఎవరూ వంక పెట్టింది లేదు. అయితే జమున కేవలం నటిగానే కాదు, రాజకీయాల్లో ఎంపీగా, నాటక అకాడమీ అధ్యక్షురాలిగా, సమాజ సేవకురాలిగా, భార్యగా, తల్లిగా ఎన్నో పాత్రలు ధరించిన మల్టీటాలెంటెడ్ పర్సన్ జమున. అయితే జమున జీవితం, కెరీర్ కూడా సాఫీగా సాగిపోలేదు.కెరీర్ పరంగా ఆమె కూడా ఎన్నో అట్లుపోట్లను ఎదుర్కొంది. తను కెరీర్‌లో ఎదుర్కొన గడ్డు పరిస్థితుల గురించి ఓ సందర్భంలో వివరించారు జమున. " నా మకాం మద్రాసుకు మార్చుకున్న టైమ్‌లో సినిమా రంగంలో నాకు పలు చేదు అనుభవాలు వున్నాయి. అందులో ముఖ్యంగా చెప్పాలంటే.. నా జీవితాంతం గుర్తుండేది మాత్రం ఒకటి వుంది. ఇద్దరు ప్రముఖ కథానాయకులు నాతో యాక్ట్ చెయ్యమంటూ దాదాపు మూడేళ్లు నన్ను బహిష్కరించారు. దాని నుండి బయటపడటానికి గట్టి ఫైట్ చేశాను.ఒక విధంగా చెప్పాలంటే అదొక పోరాటమే. కానీ నా ఈ పోరాటంలో కూడా ఏ రోజు నా ఆత్మభిమానాన్ని చంపుకోలేదు. నా వైపు రాంగ్ లేనప్పుడు నేనెందుకు ఒకరికి లొంగివుండాలి.. భయపడాలనుకునే దాన్ని.నా సినిమాలు నాకున్నాయి. అయితే అనుకోకుండా అదే సమయంలో నాకు బాలీవుడ్‌లో అవకాశాలొచ్చాయి. హిందీలో వరుసగా పన్నెండు సినిమాలు చేశాను.మిలన్ అనే సినిమాలో నా నటనను మెచ్చి ఫిలిం ఫేర్ అవార్డు కూడా వరించింది. ఆ సినిమా రజతోత్సవం కూడ జరుపుకోంది.ఇక హిందీలో బిజీగా వుండటంతో మకాంను ముంబైకి మార్చమని మరిన్ని అవకాశాలు వస్తాయని చాలా మంది సలహాలిచ్చారు.కానీ మనకు అవసరమా.. తెలుగు సినీ పరిశ్రమ ప్రేక్షకుల అండదండాలు, అభిమానాలు చాలనుకున్నాను. చివరిగా గుండమ్మ కథ సినిమా కోసం సినీ పరిశ్రమ పెద్దలు కుదర్చిన రాజీతో మళ్లీ తెలుగులో బిజీ అయ్యాను' అని చెప్పుకొచ్చారు జమున


## నా హీరోలకు లోపాలు చెబుతా కానీ..
## సూర్య కంగువ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా కామెంట్స్ వైరల్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం కంగువ . శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42వ ప్రాజెక్ట్‌గా వస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. కంగువ నవంబర్ 14న తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడులవుతుంది.ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ప్రమోషనల్ ఇంటర్వ్యూలో నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నేను సాధారణంగా నా సినిమాలను చూసిన తర్వాత నా హీరోలకు ముందుగా లోపాలను చెబుతాను. కానీ కంగువ ఫస్ట్ హాఫ్ చూసిన తర్వాత నేను ఆశ్చర్యపోయా. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్‌తో కంగువ సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోతున్నాయి. సినిమా అవుట్ పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నామని.. కంగువ రూ.2000 కోట్లు వసూళ్లు చేయడం పక్కా అని నిర్మాత ఇప్పటికే చేసిన కామెంట్స్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. కంగువలో బీటౌన్ యాక్టర్ బాబీ డియోల్ ఉధిరన్ పాత్రలో గూస్ బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అలరించబోతున్నాడు. ఈ మూవీని స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# నవీన్ చంద్ర ఇంట్రెస్టింగ్ స్టోరీ..
# ఆరు భాషల్లో స్నేక్స్ అండ్ ల్యాడర్స్

అందాల రాక్షసి సినిమాతో హీరోగా మంచి మార్కులు కొట్టేశాడు నవీన్ చంద్ర . ఆ తర్వాత ఓ వైపు లీడ్ రోల్స్, మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ కీ రోల్‌లో నటించిన తాజా వెబ్ సిరీస్ స్నేక్స్ అండ్ ల్యాడర్స్ అశోక్ వీరప్పన్, భరత్ మురళీధన్, కమల ఆల్కెమిస్ దర్శకత్వం వహించారు వరుసగా వెబ్ సిరీస్‌లు చేస్తున్న తాను స్నేక్స్ అండ్ ల్యాడర్స్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చానన్నాడు. నలుగురు టీజేజ్ పిల్లల జీవితంలో జరిగిన అనూహ్య ఘటన నేపథ్యంలో వెబ్ సిరీస్ ఆసక్తికరంగా సాగుతుంది. నలుగురు కొత్త పిల్లలతో వెబ్ సిరీస్‌ను మొత్తం కొడైకెనాల్‌లో షూటింగ్ చేశాం. ఆరు భాషల్లో స్ట్రీమింగ్ అవుతోందని అన్నాడు. ఈ చిత్రాన్ని స్టోన్ బెంచ్, అమెజాన్ ప్రైమ్ సంయుక్త నిర్మాణంలో కార్తీక్ సుబ్బరాజు, కల్యాణ్ సుబ్రమణియన్ తెరకెక్కించారు. అక్టోబర్ 18నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ వెబ్ సిరీస్‌పై మీరూ ఓ లుక్కేయండి మరి.



# విద్యార్థిని కదిలిస్తే కన్నీరు కార్చాల్సి వస్తుంది

**- ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నము భోజనం నీళ్లచారు**



**ధర్పల్లి (ప్రశ్నన్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వారిపై పర్యవేక్షణ లోపం దాని ప్రతిఫలం నీళ్లచారు అన్నం, విద్యార్థి తినే అన్నం లో రాళ్లు ఇసుక, పిన్ పంచులు, గాజు ముక్కలు, పురుగులు వస్తున్నాయి విద్యార్థిని



కదిలిస్తే కన్నీరు కార్చాల్సి వస్తుంది. ఏజెన్సీ వారు మాట్లాడుతూ మాకు ఇంతే ఆర్డర్స్ ఉన్నాయి పైనుంచి ఎంత పెట్టాలో అంతే పెడుతున్నాం అని తెలుపుతున్నారు. విద్యార్థులు అడిగితే తింటే తినండి లేకుంటే లేదు ఇక్క నుంచి వెళ్ళండి అని బెదిరిస్తున్నారని విద్యార్థులు చెప్తున్నారు. ఇదంతా గొడవలు ఎందుకు అని విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకొని స్కూల్లో తింటున్నారు. డైనింగ్ హాల్ లేదు వంట రూమ్ లేదు స్కూల్ లోకి పోతే అంతా పెంట పెంటగా ఉంది చదువు మీద దృష్టి పెట్టలేకపోతున్న విద్యార్థుల దీన గాథ.

# జానకిరామ్ కు అరుదైన డాక్టరేట్ గౌరవ పురస్కారం

**- యు.ఎస్. ఏ బార్కెల్ లోని తియోలాజికల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ దీపక్ ఫెడ్రిడ్ చేతులమీదుగా**

**- సామాజిక సేవలో గుర్తించి డాక్టరేట్ పురస్కారం**

**- డాక్టర్ దీపక్ ఫెడ్రిడ్, డాక్టర్ వెంకటస్వామి ల చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ జానకిరామ్**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మానవతావాది, అందరి ఆత్మీయుడు, ప్రేమస్వరూపుడు, ప్రముఖ సమాజ సేవకుడు తూప్రాన్ ముద్దుబిడ్డ జానకిరామ్ కు అరుదైన డాక్టరేట్ గౌరవ పురస్కారం ను అమెరికా బర్కెల్ లోని తియోలాజికల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ దీపక్ ఫెడ్రిడ్ చేతులమీదుగా సామాజిక సేవను గుర్తించి డాక్టరేట్ పురస్కారంను ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ దీపక్ ఫెడ్రిడ్, డాక్టర్ వెంకటస్వామి ల చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ తాను ఈ రోజు నా జీవితంలో మరువలేనిది, ఇది ఒక గొప్ప సువర్ణ అవకాశం అని అన్నారు. ఇందుకు ప్రోత్సహించిన డాక్టర్ వెంకట స్వామి కి, డాక్టరేట్ ప్రదానం చేసిన డాక్టర్ దీపక్ ఫీడ్రిడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దీపక్ ఫెడ్రిడ్ మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ ఒక నిర్దిష్ట రంగానికి, సమాజానికి విశిష్ట సేవలు అందించి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న మహనీయుని తెలిపారు. ఆయన అందించిన సహకారాన్ని గౌరవించే మార్గంగా డాక్టరేట్ ను జానకిరామ్ కి ఇవ్వబడిందనీ తెలిపారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత జానకిరామ్ చేసిన సమాజ సేవకు గుర్తింపుగా అధికారికంగా అందించ బడిందన్నారు. ఉన్నత విద్యా అర్హతను కలిగిఉన్నారు. స్టింగర్ గా, మండల రిపోర్టర్ గా, తాలూకా రిపోర్టర్ గా, స్టాఫ్ రిపోర్టర్ గా, ప్రధాన సంపాదకులుగా, ఎడిటర్ గా, సి.ఈ.ఓ గా అంచలంచలుగా ఒక్కో మెట్టు ఎక్కుతూ ఓ దిన పత్రిక కు చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జానకిరామ్ అన్ని రంగాల్లో రాణించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో స్వయం సేవక్ గా, ఘట నాయకునిగా, ముఖ్య శిక్షక్ గా, ఓ.టి.సి ప్రథమ వర్ష పూర్తి చేసి సమాజ నిర్మాణానికి కృషి చేశారు. అంతే కాకుండా ప్రముఖ ఇంటర్ నేషనల్ లయన్స్ క్లబ్ లో చేరి క్లబ్ ప్రెసిడెంట్ గా, జోన్ చైర్మన్ గా, డిస్ట్రిక్ట్ చైర్మన్ గా వేల సంఖ్యలో సేవా కార్యక్రమాలు చేపట్టారనీ తెలిపారు. కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, మాస్క్ లు, మందులు అందించిన సేవాతత్పరుడన్నారు. కరోనా సమయంలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు గుండా కాలి నడకన వెళుతున్న వారికి కాళ్ళకు బొబ్బలు రావడం తో చెల్లించి 500 పాదరక్షలు (చెప్పులు) పంపిణీ చేశారు. ఆకలి తో అలమిటించిన వారి ఆకలి తీర్చడానికి భోజనం, పులిహోర ప్యాకిట్లు, త్రాగు నీటి సౌకర్యంతో పాటు ఉచిత వైద్య సేవలు అందించి సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న జానకిరామ్ కి గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రధానం చేయడం చాలా గర్వంగా ఉందని అన్నారు. గౌరవ డాక్టరేట్ అవార్డు అనేది డాక్టరేట్ సంస్థ తో ముందస్తు అందించబడిందన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ జానకిరామ్ సిఆర్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్ గౌరవనీయుడు డాక్టర్ జానకిరామ్ అందుకని, అటువంటి డిగ్రీలు ఒకరి కరికులం విటే లో ఒక అవార్డుగా జాబితా చేయబడి ఉండి అందించబడిందన్నారు. ఈ గౌరవప్రదమైన డాక్టర్ జానకిరామ్ వినియోగానికి సంబంధించి, ఉన్నత సంస్థల విధానాల గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ జానకిరామ్ ఇక ముందు నుంచి డా" వారి పేరుకు ముందు వినియోగించడానికి ప్రధానం చేయడం జరిగింది. ఉన్నత సంస్థతో అనుసంధానించి మరింత సేవ చేయడానికి ప్రోత్సహిస్తూ జారీ చేయడం జరిగింది. ఇది వారి ఔన్నత్యానికిసంబంధించినది. విస్తృత సమాజంలో సంప్రదాయం ప్రకారం, గౌరవ డాక్టరేట్ గ్రహీత జానకిరామ్ కరస్పాండెన్స్‌లో "డా" శీర్షికను ఉపయోగించడానికి ప్రధానం చేయడం జరిగింది. గ్రహీత సంస్థ మౌఖికంగా, వ్రాతపూర్వకంగా "డా" అని సంబోధించవచ్చు అని అన్నారు. వారి వృత్తి/వ్యక్తిగత జీవితంలో "డా" అని సంబోధించవలెనని తెలిపారు. గౌరవాన్ని స్వీకరించడానికి జానకిరామ్ అర్హత పొందారని తెలియజేశారు. ఇక మీదట మౌఖికంగా, వ్రాతపూర్వకంగా ప్రసంగించడం కొనసాగుతుందనీ తెలిపారు. గౌరవ ఉపసర్గను జానకిరామ్ ఉపయోగించడానికి ప్రముఖ వ్యక్తుల జాబితాలో చేర్చడమైనందని పేర్కొన్నారు. డాక్టర్ జానకిరామ్ తన జ్ఞాపకాల ప్రక్రియ ఎడిటర్ గా రచయితగా కవిగా, సమాజ సేవకుడిగా ఆయన డాక్టరేట్ పొందారని, ఆయనకు డజన్ల కొద్దీ గౌరవ పురస్కారాలు లభించాయన్నారు. ఆయన కుటుంబం మరియు సన్నిహిత మిత్రులు అందరి వ్యక్తులచే "డా. జానకిరామ్" అని పిలవడానికి



ఇష్టపడి . గౌరవ డాక్టరేట్ డిగ్రీలు పట్టా సర్టిఫికెట్ పొందారని తెలియజేశారు. గ్రాడ్యుయేషన్ వేడుకలో జానకిరామ్ కు ప్రధానం చేశారు. గ్రాడ్యుయేట్ల ముందు అంగీకార ప్రసంగం చేయడానికి డాక్టరేట్ గ్రహీత జానకిరామ్ ఆహ్వానించబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమం వేడుక జానకిరామ్ జీవితంలో ముఖ్యాంశంగా ఉంటుందన్నారు. గౌరవ డాక్టరేట్ డిగ్రీ కోసం జానకీరాం నామినేట్ చేయగా అన్ని విషయాలు నిశితంగా పరిశీలించి అర్హుడిగా గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశామని స్పష్టం చేశారు. ఆమోదం పొందే ముందు అనేక కమిటీల ద్వారా అధికారిక ఆమోదం పొందిన తర్వాత మా ఆహ్వానం మేరకు జానకిరామ్ కు డాక్టరేట్ ప్రదానం చేశామన్నారు. సందర్భానుసారంగా జానకిరామ్కి గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేయబడ్డాయనీ తెలిపారు. ప్రామాణికత ద్వారా సంపాదించిన ప్రామాణికమైన డాక్టరేట్ గా పరిగణించబడుతుందని అన్నారు. డాక్టరేట్ అవార్డు గ్రహీత జానకిరామ్ అకడమిక్ స్కాలర్‌షిప్‌ను ప్రదర్శించి డాక్టరేట్ అవార్డుకు అర్హత సాధించాడని పేర్కొన్నారు. గణనీయమైన గౌరవ డాక్టరేట్ డిగ్రీల గ్రహీత జానకిరామ్ కు అకడమిక్ దుస్తులను అందించడం తో గౌరవ గ్రాడ్యుయేట్లు సముచితమైన పూర్తి-దుస్తుల గౌను ధరించి సర్టిఫికెట్ పొందారని తెలియజేశారు. డాక్టరేట్ అవార్డు డిగ్రీని గౌరవంగా పరిగణిస్తారనీ తెలిపారు. తగిన స్థాయి సాధించిన జానకిరామ్ కి శాశ్వతంగా ఇవ్వబడతాయన్నారు. నిర్దిష్ట పరిస్థితులలో జానకిరామ్ గారు నిర్వహించే కార్యాలయ స్వభావం, ప్రవచనం పూర్తి చేయడం రెండింటికీ డాక్టరేట్ అవార్డు డిగ్రీని ప్రదానం చేశామన్నారు. "డాక్టరేట్ అనేది పూర్తి అకడమిక్ డిగ్రీగా పరిగణించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటస్వామి, హర్షవర్ధన్ లుతదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

**- స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదన్న కాలనీ వాసులు**




కాప్రా (ప్రశ్న న్యూస్) డ్రైనేజి సమస్య వల్ల మనుషులు చనిపోతున్నా, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు కంప్లైంట్ లు చేసినా అటు ఎమ్మెల్యే, ఇటు కార్పొరేటర్ లు పట్టించుకోకపోవడం మేము



చేసుకున్న దౌర్భాగ్యామ అని సాకేత్ మిథిల కాలనివాసులు ఆవేదన అంతా ఇంతా కాదు. వారి ఆవేదనలు రోజు రోజుకూ ఎక్కువవడంతో ఆదివారం కాలనీవాసులంతా రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. అధికారులు అక్రమ నిర్మాణాల వసూళ్ల విషయంలో క్షణం కూడా ఆగకుండా ఉంటారు కాని, పబ్లిక్ సమస్యలు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహించటం సిగ్గుచేటన్నారు. సాకెత్ ప్రక్కన ఉన్నటువంటి కాలనీతోపాటు ఇతర కాలనీవారు డ్రైనేజ్ వ్యవస్త సరిగ్గాలే తాము రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు ఇన్ని సమస్యలతో బాధపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరనసనలో కాలనీ అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరి శ్రీనివాస్, సభ్యులు రాంరెడ్డి, రాజు, ఎంఎస్కె నాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్ ను సన్మానించిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి వివేక్



మంథని ( ప్రశ్న న్యూస్) వివేక్ వెంకటస్వామి తెలంగాణ రాజకీయాల్లో ప్రముఖ పాత్రధారులలో ఒకరు. ఆయన రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నతమైన పదవులు చేపట్టి, ప్రజల కోసం పనిచేశారు. మాజి ఎంపీగా, చెన్నూరు ఎమ్మెల్యేగా వివేక్ తన ప్రజాప్రతినిధ్యంతో విశేషంగా పేరు తెచ్చుకున్నారు. వివేక్ వెంకటస్వామి గారి ప్రత్యేకత ఆయన ప్రజల పట్ల ఉన్న మక్కువ, సేవా నిబద్ధత. ఆయన ప్రజల సమస్యలను గమనిస్తూ, వాటికి పరిష్కార మార్గాలను చూపిస్తూ తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే, వివిధ కమిటీలు, సంస్థల ద్వారా తమ నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ, మరింత ప్రజాసేవకు కట్టుబడి ఉన్నారు. ఇలాంటి వారిని మర్యాద పూర్వకంగా కలవడం ద్వారా వారి నాయకత్వానికి మరింత గౌరవం పెరిగింది. నూతనం గా పవవులు పొంది, పెద్దపెల్లి మాజి ఎంపీ ,చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి ఆనందం వ్యక్తం చేసిన. అంతటి అన్నయ్య గౌడ్ - పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్,మినిపాల ప్రకాష్ రావ్ సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ,వివేక్ కూడా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సాల్వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో టిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ధర్నా.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధిలోని అంబేద్కర్ చౌక్ లో టిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతూ ఇప్పటివరకు రైతులకు చేసిన మేలు ఏమీ లేదని రైతుబంధు ఇవ్వలేదు అని. ఆడబిడ్డలకు 2500 రూపాయలు ఇవ్వలేదు ఫ్రీ కరెంటు కూడా కొంతమందికి వస్తలేదు అని రైతు రుణమాఫీ కూడా కొంతమందికి వర్తించలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాలను ఎండగడుతూ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏ గోల శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఆడబిడ్డలు కాంగ్రెస్ గవర్నమెంట్ చేస్తున్న మోసాలను ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు రైతులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఇప్పటికి కూడా ఒక్క హామీ నెరవేర్చలేదని ఇంకెప్పుడు నెరవేరుస్తుందని రైతులను మోసం చేస్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఇకనుండి అయినా ఈ మోసపూరితమైన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలని లేకుంటే రైతులు తగిన బుద్ధి చెబుతారని.ప్రజలు కోరుతున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన

**ఎమ్మెల్యే రెకులపల్లి భూపతిరెడ్డి**



ధర్పల్లి (ప్రశ్నన్యూస్) నిజామాబాద్ జిల్లా రూరల్ పరిధిలో ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రెకులపల్లి భూపతిరెడ్డి. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా వరి ధన్యం కేంద్రాలలో ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320 , బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 ,ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు సన్నాలను కూడా పండించాలని ఆయన అన్నారు సన్నాలకి 500 రూపాయలు బోనస్ అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ధర్పల్లికాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ ,సొసైటీ చైర్మన్ చిలిమెల మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగ్య,జిల్లా నాయకుడు చెలిమెల నర్సయ్య, జె సి పి శ్రీనివాస్, సొసైటీ సిఈఓ సంతోష్ రెడ్డి, ప్రవీణ్ నరేష్,రాజ్ పాల్,ఆర్గుల రాజేశ్వర్, బొక్కల బాలయ్య కుమ్మరి గుండయ్యా,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలోని హీరో ద్విచక్ర వాహన మేళా ప్రారంభం.

**స్కూటీ నడిపి సందడి చేసిన పద్మాక్క**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) స్కూటర్స్ నడపడం అంటే చిన్నప్పటి నుంచి తనకు ఎంతో ఇష్టమని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో న్యూ వాసు మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హీరో ద్విచక్ర వాహన మేళాను టెస్ట్ డ్రైవ్ ను ప్రారంభించారు. స్కూటీ నడిపి సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివాళీ పండుగ సందర్భంగా ప్రతి బైక్ పై రూ. 10 వేలు తగ్గించిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బండ నరేందర్, మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి,తాజా మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, కో కన్వీనర్లు లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, కౌన్సిలర్లు జయరాజ్, సుంకయ్య, నాయకులు సాదిక్ అలీ, మధు, సాప. సాయిలు, మోహన్ రాథోడ్,శ్రీనివాస్, సాయ గౌడ్, బిక్షపతి రెడ్డి, ప్రభాకర్, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా ఉంటాం..

# మూసీ కూల్చివేతలను అడ్డుకుంటాం

**- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



ఎల్బీనగర్ : మూసీ పరివాహకంలోని ఇండ్లను కూల్చాలంటే తమను దాటి వెళ్లాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా ఉండి మూసి కూల్చివేతలను అడ్డుకుంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని జనప్రియ అవెన్యూ అపార్ట్‌మెంట్ సముదాయం, చైతన్యపురి డివిజన్ సత్యనగర్ కాలనీలో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహకంలోని ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు అందుబాటులో ఉంటారని, ప్రజలకు ఎలాంటి హాని జరుగనివ్వబోమని అన్నారు. 1964 ప్రాంతంలో ఇక్కడి ప్రజలు మూసీ నీరు త్రాగేవారని, అంత స్వచ్ఛంగా నీరు ఉండేదని అన్నారు. ఎమ్మార్డీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే మూసీ ప్రక్షాళన ప్రారంభించానని అన్నారు. మూసీ నీటిని శుద్ధి చేసేందుకు 32 ఎస్‌టీపీలను ప్రారంభించామని, వాటిలో కొన్ని పూర్తయ్యాయని అన్నారు. ప్రజలను ఇబ్బందులు పెడతామంటే, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతామంటే తాము ఒప్పుకోమని వెల్లడించారు.

# రేవంత్ రెడ్డీ.. నీ వెంటపడుతూనే ఉంటాం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తన విమర్శల దాడిని కొనసాగించారు. బుల్డోజర్ ఎక్కిస్తే, పేదల కోసం చావడానికైనా సిద్ధమని ప్రకటించారు. పేదల ఇళ్లు కూలగొడితే ఊరుకునేది లేదు నీ వెంట పడుతూనే ఉంటాం అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు.

"మూసీ సుందరీకరణకు అడ్డువస్తే నన్ను, కేటీఆర్ ను బుల్డోజర్ల కిందేసి చంపేస్తాడట! మిస్టర్ రేవంత్ రెడ్డీ నువ్వు చంపుతానన్నా, నువ్వు కేసులు పెడతానన్నా మేం భయపడేది లేదు, అట్లా భయపడే వాళ్లమైతే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేవాళ్లం కాదు! కేసీఆర్ గీసిన గీతలో, ప్రాణాలకు తెగించి, కేసులకు భయపడకుండా పోరాడాం కాబట్టే తెలంగాణ తీసుకువచ్చాం. ఇవాళ నీ తాటాకు చప్పుళ్లకు భయపడతామా!" అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు రావడం లేదని, ప్రభుత్వంపై పోరాటం చేయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. పెన్షన్లు పెంచుతామని చెప్పి మోసం చేశారని, రేవంత్ రెడ్డి మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు.

## ఢిల్లీ వాయు కాలుష్యానికి కారణాలివే.. - సీఎం అతిషి



బీజేపీ డర్టీ పాలిటిక్స్ వల్లే ఢిల్లీలో వాయు, జల కాలుష్యం పెరుగుతున్నదని ఢిల్లీ సీఎం అతిషి ఆరోపించారు. శీతాకాలంలో పొగ మంచు కురియడం వల్ల రోజురోజుకు దేశ రాజధాని పరిధిలో వాయు నాణ్యత పడిపోతున్నది. యమునా నదీ తీరాన ప్రత్యేకించి కాళింది కుంజ్ వంటి ప్రాంతాల్లో చిక్కని విష రసాయనాల లేయర్లు ఏర్పడ్డాయని పరిశోధనల్లో తేలింది. హర్యానాలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వం వల్లే ఢిల్లీలో వాయు నాణ్యత పడిపోతున్నదని ఆమె ఆరోపించారు. ఢిల్లీలోని కౌసంబీ బస్ డిపో నుంచి ఢిల్లీ-ఘజియాబాద్ సరిహద్దుల మీదుగా వేల డీజిల్ బస్సులు ప్రయాణం చేస్తాయని, హర్యానాలో రైతులు ప్యాడీ స్టబుల్ దహనం చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. కానీ, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ సారధ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ వల్లే ప్రజలకు సాయం చేస్తుందన్నారు.

# అడ్డగోలు అక్రమ నిర్మాణాలకు అడ్డా మల్కాజిగిరి సర్కిల్

**- మల్కాజ్గిరిలో యదేచ్చగా సెల్లార్ అక్రమ నిర్మాణాలు - నోడల్ అధికారి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న వారు ఎవరు.?**

**- మల్కాజిగిరి సర్కిల్ న్యాక్ ఇంజనీర్ రాజేష్ రెడ్డి నే కర్త కర్మ క్రియ నా.?**



మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) అక్రమ ఆక్రమణలకు పెట్టింది పేరు మల్కాజిగిరి నియోజకవర్గం మారింది. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలే అసలు జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది డ్యూటీ చేస్తున్నారా అనే సందేహాలకు తావిస్తోంది. మల్కాజ్గిర సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది ప్రజలు కంప్లైంట్స్ పట్టుకొని తిరగడమే తప్ప చర్యలు తీసుకుంటున్న దాకాలాలే లేవు అనే చరిత్ర ఉంది ఇక్కడి అధికారులకు. ప్రజలు కంప్లైంట్స్ ఇవ్వడానికి వస్తే ఆ కంప్లైంట్స్ ని అడ్డుపెట్టుకుని భారీగా క్యాష్ చేసుకోవడం తప్ప ప్రజల కోసం పనిచేసిన అధికారులు లేరు. మల్కాజ్గిరి జిహెచ్ఎంసి లో పని చేసిన ఏ అధికారి అయినా కోట్లకు పడగలె తే అధికారి అనే బ్రాండ్ మార్క్ ఉంది అనీ ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు గురించి ప్రస్తావించే తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అంత అనుమానం ఉంటే ఇక్కడ ఏసీపీలుగా పనిచేసిన ఏ అధికారి అక్రమ ఆస్తులు చూసిన కోట్లలో ఉన్నాయంటే ఆశ్చర్యం పోవలసిన అవసరం లేదు ఎందుకంటే వాళ్లు ఇక్కడ చేసే అవినీతి అక్రమాలు చాలు వాళ్ళ అక్రమాస్తుల సంపాదనకు. ఇక్కడ విధులు నిర్వహించే సెక్షన్ ఆఫీసర్ కోట్ల అవినీతి సంపాదన చేస్తున్నారు అంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇక టౌన్ ప్లానింగ్ విభాగంలో న్యా క్ ఇంజనీర్ రాజేష్ రెడ్డి వ్యవహారం ఇష్టారాజ్యం మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ మొత్తం న్యాక్ ఇంజనీర్ ఏ కర్త కర్మ క్రియ అన్నట్లుగా మారింది పరిస్థితి. ప్రజలు కంప్లైంట్ తీసుకొని వస్తే చూస్తామంటే చెప్పి పంపించేసి అక్రమ నిర్మాణదారులతో అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకొని మరి మీకు ఇంతా మకు ఇంతా అంటూ ఒప్పందాలా రాయబారి అవతారం ఎత్తుతారు అన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. చర్చలు సఫలం అయితే సర్వం సమర్పయామి, చర్చలు విఫలమైతే కంప్లైంట్ లు వస్తున్నాయి అంటూ హై డ్రామాకు తెర లేపుతారు. నోటీసులు జారీ చేయకుండా జారీ చేస్తాము అంటూ ప్రజలను వెర్రి వాళ్ళని చేసి చేతులు నింపుకోవడమే న్యాక్ ఇంజనీర్ రాజేష్ రెడ్డి పని అన్న విమర్శలు ఉన్నాయి.నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చిన నోటీసులు ఇవ్వకుండా కలయాపన చేస్తూ ఉన్నత అధికారులకు ఏదో ఒక కారణం చెబుతూ మభ్య పెడుతున్నారు అనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. తాను అనుకున్న విధంగా ఎవరైతే ఉండరో వారికి మాత్రమే నోటీసులు జారీ చేస్తూ దారికి వచ్చేలా మరచుకునే ఆపర మేధావి అంటూ విమర్శలు కూడా లేకపోలేదు. ఈ న్యాక్ ఇంజనీర్ పని తీరుపై అధికారులు



సిబ్బంది కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నోడల్ ఆఫీసర్ ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేయడంలో భేష్ అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ అండదండలతోనే మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి దందా జోరుగా సాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారులపై సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సుజాతనగర్‌లో కొత్త సంప్రదాయాలు

**- గుప్త పూజల ఆంతర్యం ఏంటి.?**




భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్) దసరా పండుగ వచ్చిందంటే అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి నవరాత్రులు పూజలు చేస్తుంటారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించి నీళ్ళల్లో నిమజ్జన కార్యక్రమం చేస్తారు. ఇది అన్ని ప్రాంతాల్లో జరిగే నవరాత్రుల వేడుక. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ లో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుంది. నవరాత్రులు పూజలు అందుకున్న అమ్మ వారిని వాగు వరకు తీసుకెళ్ళి నిమజ్జనం చేయకుండా వదిలేస్తారు. ఎందుకు ఇలా చేస్తారు అంటే సమాధానం ఉండదు. ఊరందరూ నిమజ్జనం చేయాలని పట్టుబట్టినా ఒక్కరూ మాత్రం వద్దని వాదిస్తున్నారు. దీనిపై సుజాతనగర్ మండల వ్యాప్తంగా అమ్మవారి భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్ని చోట్ల జరిగిన



ఘటనలు గుర్తు చేసుకొని భయాందోళనకు గురి అవుతున్నారు.

## అపచారం అంటున్న వేద పండితులు

నవరాత్రులు పూజలు అందుకున్న అమ్మవారిని నిమజ్జనం చేయకుండా వదిలివేయడం వల్ల ఊరికి చెడు జరుగుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. కొందరు స్వార్ధ బుద్ధితో శక్తులను వశ పరుచుకోడానికి చేసే ప్రయత్నంలో భాగంగానే ఇలా చేస్తారని చెప్పుకుంటున్నారు. హిందూ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించిన విగ్రహాలను నదుల్లో, కాలువల్లో, పారే నీళ్ళలో నిమజ్జనం చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. అటువంటి ఆచారాన్ని తుంగలో తొక్కి తమ ప్రయోజనాలకు అనువుగా రహస్య పూజలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



## డబ్బు సంపాదనే ధ్యేయంగా పూజలు

తాంత్రిక విద్యల్లో ప్రావీణ్యం పొందాలనే అత్యాశతో ఎన్నో తరాలుగా నమ్మే ఆచార వ్యవహారాలను పక్కన పెట్టిస్తున్నారనే వాదన మండల ప్రజల్లో బలంగా వినిపిస్తుంది.

## సూటిగా ప్రశ్నించండి...

ప్రజలకు మంచి చేకూర్చే పనే అయితే కారణాలు ఎందుకు చెప్పడం లేదు ? ఇందులో ఉన్న ఆంతర్యం ఏంటి.? లోకంలో ఎక్కడా లేని ఆచారం మనకి ఎందుకు.? ఏది ఏమైనా కొందరి స్వార్థ ప్రయోజనాలకు అందరూ అనుభవించక తప్పదని భక్తుల వాదన









Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588